రైతన్నకు చేయూత..



- ఎకరానికి రూ.10 వేలు రైతుబంధు
- నేరుగా రైతుల అకౌంట్‌లో జమ
- మండలంలో 17,558 మంది రైతులకు లబ్ధి
- 10,931 మంది రైతులకు 'బీమా'

తల్లాడ: వ్యవసాయం కోసం పెట్టుబడిని నగదు రూపంలో రైతులకు అందించేందుకు తెలంగాణా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకమే రైతుబంధు పథకం . ఈ పథకాన్ని తెలంగాణా సీఎం కేసీఆర్ 2018 మే 10న ప్రారంభించారు. ఏడాదంతా వ్యవసాయం చేసే రైతులకు పంటల్లో ప్రకృతి వైపరీత్యాలు, చీడ పీడల వల్ల అనేక ఒడి దుడుకులు ఎదురౌతాయి. అన్నదాతకు మార్కెట్ సౌకర్యం కూడా సరిగా లేక అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి అన్న చందంగా ఉంటుంది. దిగుబడి సరిగా లేక నష్టాలను చవి చూస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులను ఆదు కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద రైతుబంధు పథకం అమలు చేస్తుంది. ఇప్పటికీ 11 విడతల వారీగా రైతుబంధు అందించింది. ఈ పథకం ద్వారా మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో 17,558 మంది రైతులు లబ్ధి పొందుతున్నారు. ఈ ఏడాది రూ.18.76 కోట్లు పెట్టుబడి సాయం అందనుంది. గతేడాది 17,013 మంది రైతులకు గాను రూ.18.59 కోట్లు సాయం అందింది.

ఖరీఫ్, రబీ సీజన్ల కలిపి ఎకరానికి రూ.10 వేలు..

రైతుబంధు పథకం ద్వారా ఖరీఫ్, రబీ సీజన్లకు ఏక రానికి రూ.5 వేలు చొప్పున రెండు సీజన్లకు రూ. రూ.10 వేల పెట్టుబడి అందిస్తుంది. పట్టాదారు పాసు పుస్తకం ఉన్న రైతులందరికీ భూమి విస్తీర్ణంతో సబంధం లేకుండా ఎకరానికి రూ.10 వేల చొప్పున నేరుగా బ్యాంక్ అకౌంట్లలో రెండు విడతలుగా జమ అవుతుంది. మండలంలో ఇప్పటి వరకు 17,558 మంది రైతులు రైతుబంధు పథకానికి అర్హులుగా ఉన్నారు. ఈ ఏడాది జూన్ 18 వరకు పాస్‌బుక్ అయిన వారికి ఈ పథకం వర్తిస్తుంది.

కావాల్సిన ధ్రువ పత్రాలు..

పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డ్, బ్యాంక్ ఎకౌంట్‌ను జతపర్చి దరఖాస్తు ఫారం నింపి సంబంధిత ఏఈఓలకు లేదా మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో సమర్పించాలి.

రైతు బీమా.. కుటుంబానికి భరోసా

రైతు బీమా పథకం రైతు కుటుంబానికి భరోసాగా నిలిచింది. 18 నుంచి 59 సంవత్సరాల లోపు రైతులు రైతు బీమాకు అర్హులు. జూన్ 18 వరకు పట్టాదారు పాస్‌బుక్ అయిన వారికి ఈ పథకం వర్తిస్తుంది. మండలంలో 10,931 మంది రైతులు రైతు బీమాకు అర్హులుగా ఎంపికయ్యారు. ఈ ఏడాది మండలంలో 59 మంది రైతులు వివిధ కారణాలతో మృతి చెందగా ఒక్కో రైతుకు రూ.5 లక్షల చొప్పున వారికి రూ.2.95 కోట్లు బీమా అందజేశారు. రైతు మృతి చెందిన తర్వాత వారం రోజుల్లో డాక్యుమెంట్లు అన్నీ సమర్పిస్తే నామినీ పేరుతో రూ.5 లక్షల జమ అవుతాయి.

అర్హులైన రైతులందరికీ రైతుబంధు, బీమా..



మండలంలో అర్హులైన రైతులందరికీ రైతుబంధు, రైతు బీమా వరిస్తుంది. పట్టాదారు పాసు పుస్తకం ఉండి రాని పాత, కొత్త రైతులు దరఖాస్తు చేసుకోవచ్చు. 18 నుంచి 59 సంవత్సరాల లోపు రైతులు రైతుకు బీమాకు ఆగస్టు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. జూన్ నెలలో ఖరీఫ్ పెట్టుబడి సాయం రైతుల అకౌంట్‌లో జమ అవుతుంది.

– ఎండీ.తాజుద్దీన్, ఏఓ, తల్లాడ

పెట్టుబడికి ఉపయోగపడుతుంది..



జూలై నెలలో పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం ఎకరానికి రూ.5 వేలు నేరుగా ఎకౌంట్లలో జమ చేసింది. దీంతో ఈ డబ్బులు పంట సాగు ప్రారంభంలో విత్తనాలు, ఎరువులు, దుక్కులు దున్నడానికి ఉపయోగపడుతుంది. సకాలంలో రైతుబంధు పథకం డబ్బులు జమ కావటం వల్ల రైతును ప్రభుత్వం ఆదుకున్నట్లైంది.

– దగ్గుల జనార్ధన్‌రెడ్డి, రైతు, తల్లాడ

ఇది చెరువు కాదు.. రోడ్డే

మధిర/తల్లాడ: మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి ప్రధాన రహదారిపై, తల్లాడ జాతీయ రహదారిలో నిత్యం అనేక వాహనాలు తిరుగుతుంటాయి. గురువారం కురిసిన వర్షం కారణంగా ఈ రోడ్లపై నిలిచిన వరద నీరు చెరువును తలపిస్తుంది. దీంతో వాహనదారులు ఇది చెరువా లేక రోడ్డా అని ఆశ్చర్యపోతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు ఏళ్ల తరబడి ఇదే సమస్య. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.



తల్లాడ రింగ్‌రోడ్ సెంటర్లో నిలిచిన వరదనీరు



మధిర-మడుపల్లి ప్రధాన రహదారిపై..

నాలుగు రోజులుగా తాగునీటి సరఫరా బంద్

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలోని ముక్రిహిల్స్ వద్ద నుంచి మిషన్ భగీరథ తాగునీటిని పలు మండలాలకు సరఫరా చేస్తున్నారు. దీనిలో భాగంగా కొణిజర్ల పంచాయతీ కార్యాలయంలో నిర్మించిన సంప్, ఓవర్ హెడ్ ట్యాంక్ ద్వారా మండలంలోని 16 గ్రామాలకు ఈ నీరు సరఫరా అవుతుంది. ఈ ఓవర్ హెడ్ ట్యాంకుకు నీటిని సరఫరా చేసే గేట్ వాల్వ్ నాలుగు రోజుల క్రితం పాడైపోయింది. మరమ్మతులు చేయాల్సిన కార్మికులు ఈ నెల 18 నుంచి సమ్మెలో పాల్గొనడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. మా సమస్యలు పరిష్కరించేంత వరకు మేము నీటి సరఫరా చేస్తాము తప్పా మరమ్మతులు చేయమనడంతో ప్రజలు చేతి పంపుల వద్ద బారులు తీరారు. అధికారులు స్పందించి త్వరగా గేట్‌వాల్వ్ మరమ్మతులు చేయించి తాగునీటి సరఫరా పునరుద్ధరించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మిషన్ భగీరథ ఇంట్రాగ్రిడ్ ఏఈ చైతన్యను సాక్షి వివరణ కోరగా గేట్ వాల్వ్ మరమ్మతులకు సంబంధించిన సామగ్రి అంతా కొణిజర్లలో సిద్ధంగా ఉంచామన్నారు. భగీరథ కార్మికులు సమ్మెలో ఉండి పని చేయడానికి నిరాకరించడంతో పనిలో ఆలస్యమైందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ఒకటి రెండు రోజుల్లో సమస్య పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు.

ఓటర్ల జాబితా సవరణపై బీఎల్‌ఓలకు శిక్షణ

కల్లూరు: మండలంలో ఉన్న బీఎల్‌ఓలకు గురువారం ఓటర్ల జాబితా సవరణపై తహసీల్దార్ బాబ్జీప్రసాద్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తులు చేసుకునేలా బీఎల్‌ఓలు క్షేత్ర స్థాయిలో సమాచారం అందించాలన్నారు. ఓటర్ల జాబితా సవరణలో చనిపోయిన వారిని గుర్తించాలని, వికలాంగులను నేరుగా కలుసుకుని ఓటు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు అన్వర్, స్టాలిన్‌లు, మండల పరిధిలోని 62 మంది బీఎల్‌ఓలు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.



కల్లూరు: బీఎల్‌ఓలకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ బాబ్జీ ప్రసాద్

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌పై అవగాహన..

మధిర: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మధిర తహసీల్‌లో గురువారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్, వీవీ ప్యాట్‌పై అవగాహన కల్పించారు. తహసీల్దార్ జి.కృష్ణ, నాయబ్ తహసీల్దార్ కె.రాజేష్ మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌పై ఓటు వేసే విధానం గురించి 20 రోజుల పాటు కార్యాలయంలో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండండి

సత్తుపల్లిటౌన్: భారీ వర్షాల నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. నియోజకవర్గంలో ఉన్న ఐదు మండలాల అధికారులు ప్రతి చెరువులో నీటి నిల్వలు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

ఏన్కూరు: మండలంలోని సూర్యతండ, తిమ్మారావుపేట, మూలపోచారం, రాజలింగాల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ముజాహిద్ గురువారం పరిశీలించారు. అనంతరం మూలపోచారం, రంగాపురం గ్రామల మధ్య ఉన్న వంతెనను సందర్శించారు. వరద వస్తే తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎస్సై బాదావత్ రవి, ఆర్‌ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

భోజనశాల ప్రారంభం



భోజనశాలను ప్రారంభిస్తున్న దాతలు

మధిర: చిలుకూరు గ్రామానికి చెందిన పిల్లలమర్రి లక్ష్మయ్య, నాగరత్నమ్మ జ్ఞాపకార్థం రూ.6 లక్షల నిధులతో చిలుకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భోజనశాలను నిర్మించారు. దీనిని గురువారం వారి కుటుంబ సభ్యులు నరసింహారావు, అన్నపూర్ణమ్మ దంపతులు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంధ్యా వంశీ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వూట్ల శంకర్ రావు, పిల్లలమర్రి రాంబాబు, స్వాతి, రావిరాల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో కూరగాయల పెంపకం



విత్తనాలు నాటుతున్న విద్యార్థులు, హెచ్‌ఎం

మధిర: మధిర పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో కూరగాయల పెంపకం చేపడతామని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ ప్రభుదయాళ్ తెలిపారు. సీపీఎస్ పాఠశాలలో రాబోయే రోజుల్లో మధ్యాహ్న భోజన పథకానికి ఉపయోగపడే విధంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది కలిసి పాఠశాల ఆవరణలో ఖాళీగా ఉన్న స్థలంలో గురువారం కూరగాయ విత్తనాలు నాటారు. బీర, సొర, చిక్కుడు, దోసకాయ గింజలను పాదులు చేసి నాటారు.

విజేతలకు బహుమతులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని నారాయణ పాఠశాలలో గురువారం జాతీయ చెస్‌డే సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన చెస్ పోటీలలో విజేతలుగా నీరజ్, జాన్సన్, అఖిల్, షాజీద్‌ల నిలిచారు. వీరికి బహుమతులు, పతకాలు అందించారు. కార్యక్రమంలో ఏజీఎం వేణుగోపాలరావు, వైస్ ప్రిన్సిపాల్ ముత్తయ్య, పూనం చంద్ర, సతీష్, పీఈటీ మురళీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభచూపిన విద్యార్థులకు ప్రోత్సాహం

కారేపల్లి: కారేపల్లి పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌లో ఉంటూ.. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో గత ఏడాది ప్రతిభచూపిన విద్యార్థులకు కారేపల్లి ఎస్సై రామారావు నగదు ప్రోత్సాహం అందించారు. ఈ సందర్భంగా కారేపల్లిలోని ఇల్లందు రోడ్‌లో ఉన్న పోస్ట్ మెట్రిక్ బాలికల, ఖమ్మం రోడ్‌లో ఉన్న సెల్ఫ్‌మేనేజ్‌మెంట్ బాలుర హాస్టళ్లను ఎస్సై సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కృషి, పట్టుదలతో చదివితే సాధించలేనిది ఏదీ లేదన్నారు. కార్యక్రమంలో వార్డెన్ కృష్ణ, సిబ్బంది శంకర్, శ్రీనివాస్, భూక్యా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కురుమలు రాజకీయంగా ఎదగాలి

కొణిజర్ల: కురుమలు రాజకీయంగా ఉన్నత స్థానాలకు చేరుకుని కురమల సంక్షేమానికి పాటుపడాలని కురమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల మధు, గొర్రెల మేకల పెంపకం దార్ల సంఘం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి భద్రయ్య అన్నారు. ఇటీవల కొణిజర్ల గొర్రెల మేకల పెంపకం దార్ల సంఘం నూతన కమిటీ ఎన్నికలో గెలుపొందిన సభ్యులు, అధ్యక్ష,కార్యదర్శులుగా ఎన్నికైన మల్లిబాబు, అలివేలు, ముత్తయ్యలను గురువారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామారావు, బండారు కిషన్‌రావు, తుప్పతి నాగ, మహేష్, వెంకన్న, ఆదిరెడ్డి, బీమయ్య, నాగేశ్వరరావు, వెంకన్న, లాలయ్య పాల్గొన్నారు.

హనుమంతరావు మృతికి సంతాపం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 1977–78 వరకు కళాశాల ప్రెసిడెంట్‌గా చేసిన రిటైర్డ్ కామర్స్ లెక్చరర్ కె.హనుమంతరావు గురువారం కోదాడలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతిపట్ల కళాశాల పూర్వ విద్యార్థులు సంతాపం తెలిపారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

వైరా/ఎర్రుపాలెం: నిరుపేదలకు ఇళ్ల స్థలాలతో పాటుగా గృహలక్ష్మి పథకం కింద రూ.5 లక్షలు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేస్తూ గురువారం సీపీఎం వైరా మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కొండకొడిమ, రెబ్బవరం, విప్పలమడక, అష్టగుర్తి, గరికపాడు, ఖానాపురం, గ్రామాలలో నిలిచిన డబుల్ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబులు మాట్లాడారు. అదే విధంగా ఎర్రుపాలెం మండల కేంద్రంలోని స్వర్గీయ రామిశెట్టి పుల్లయ్య భవనములో సీపీఎం అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు తేలప్రోలు రాధాకృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వం కార్మికులకు ఇళ్ల స్థలాలతో పాటుగా అర్హులైన బీసీ కులాల్లోని వారందరికీ లక్ష రూపాయల బీసీ బంధును అమలు చేయాలన్నారు.ఈ కార్యక్రమాల్లో తోట నాగేశ్వరరావు, తూము సుధాకర్, రమణ, శ్రీనివాసరావు, సీతారాములు, కృష్ణవేణి, ప్రమీల, గట్టమ్మ, మజీద్, రహానా, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జోగయ్య, సంజీవరావు, వెంకటేశ్వర్లు, లాలా, బసవయ్య మోక్షానందం, సుబ్బారెడ్డి, రోషన్ తదితరులు పాల్గొన్నారు.



వైరా: తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం శ్రేణులు

నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు



సాక్షి ఎఫెక్ట్..

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని కల్వతరురోడ్ సాయిరాఘవ టవర్స్ వెనుక వీధిలో విరిగిపోయిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి నూతన విద్యుత్ స్తంభాన్ని విద్యుత్‌శాఖ ఏఈ శరత్‌బాబు గురువారం ఏర్పాటు చేశారు. 'సాక్షి'లో గురువారం 'ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం' శీర్షికన ప్రచురితమైన కథనా నికి విద్యుత్‌శాఖ అధికా రులు స్పందించారు. కార్యక్రమంలో లైన్‌మెన్ మహబూబ్, సిబ్బంది అలీ, అశోక్ రెడ్డి చెన్నారావు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల నియామకం

మధిర: మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి పొలిటికల్ సైన్స్, హిస్టరీ, కంప్యూటర్ అప్లికేషన్స్ సబ్జెక్టులకు అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఏఎల్‌ఎన్ శాస్త్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ అప్లికేషన్లను సంబంధిత ధృవపత్రాలతో ఈ నెల 24 సాయంత్రం 4 గంటల్లోగా కళాశాలలో అందించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు పీజీలో 50 శాతం, ఇతర అభ్యర్థులకు పీజీలో 55శాతం మార్కులు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. పీహెచ్‌డీ, ఎన్‌ఈటీ, ఎస్‌ఈటీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, బోధనా అనుభవానికి వెయిటేజ్ ఉంటుందన్నారు. ఇంటర్వ్యూ ఈ నెల 26న కళాశాలలో ఉదయం 10:30 గంటలకు నిర్వహించబడుతుందని తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.

కేజీబీవీలో డీవార్మింగ్ డే..

కారేపల్లి: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని.. కారేపల్లి కస్తూర్బా గాంధీ గురుకుల బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు నులిపురుగుల నివారణ మాత్రలను విద్యాలయం స్పెషలాఫీసర్ జాన్సీసౌజన్య వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 15 సంవత్సరాల లోపు విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు వేయాలని, దీంతో విద్యార్థుల్లో సంభవించే పోషకాహార లోపాలను సవరించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కవిత, స్వాతి, నూర్జాహాన్, ఎఎన్‌ఎం సులోచన పాల్గొన్నారు.

ఒరిగిపడిన వైఎస్సార్ విగ్రహం

కల్లూరు: కల్లూరులోని ఖాన్‌ఖాన్‌పేట వద్ద ఉన్న దివంగత మాజీ సీఎం డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహం పక్కకు ఒరిగి పడింది. ఈ విగ్రహాన్ని మాజీ సర్పంచ్ సుజాత ఆధ్వర్యాన కొన్నాళ్ల క్రితం ఏర్పాటుచేశారు. అయితే, వర్షాలతోపాటు గాలి దుమారానికి కింద బేస్‌మెంట్ బలహీనపడడంతో విగ్రహం పడిపోయింది.

ఘనంగా సీత్లా వేడుకలు

ఏన్కూరు: మండలంలోని బురదరాఘవాపురంలో గురువారం గిరిజనులు సీత్లా పండుగలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుట్టలు తలపై పెట్టుకొని ఊరేగింపుగా వెళ్లి గ్రామదేవలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరుతున్న గుట్టకిందిగుంపు గ్రామస్తులు

కారేపల్లి: మండలంలోని గుట్టకిందిగుంపు గ్రామంలో వివిధ పార్టీల నుంచి 50 కుటుంబాలు వైరా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ధరావత్ రామ్మూర్తినాయక్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజులల ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఉండం రాఘవులు, ధనసరి వీరస్వామి, సారయ్య, ప్రవీణ్, ఎర్రయ్య, రాంబాబు, అంజి, ప్రదీప్, ప్రశాంత్, ప్రశాంత్, నవీన్, నాగేందర్, తిరుమలేష్, అశోక్, రంజిత్, రమణ, సులోచన, వెంకటమ్మ, పాదుగు అనిత, హైమా, నాగలక్ష్మి, రుక్మిణి, అంజమ్మ, చేల అంజమ్మ, పొడుగు కోటమ్మ, ఉండం సుజాత, మూతి సుజాత, వెంకటనర్సమ్మ, పాపమ్మ, ఊకె అంజమ్మ తదితరులు ఉన్నారు. అనంతరం వారు పలు గ్రామాల్లో కాంగ్రెస్ పథకాలను వివరించారు. కార్యక్రమాల్లో నాయకులు భద్రునాయక్, సురేందర్ మనియార్, గోపాల్‌నాయక్, ఎంపీటీసీ పార్వతి, ఓంప్రకాశ్‌బూబ్, రాందాస్, వీరన్న, రాజేష్, హనుమా, నరసింహారావు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

రేపు మాజీ ఎంపీ పొంగులేటి పర్యటన

సత్తుపల్లి: టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరించాక మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తొలిసారిగా ఈనెల 22న సత్తుపల్లికి రానున్నారని డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ బాబు, కాంగ్రెస్ నాయకుడు కొండూరు సుధాకర్ తెలిపారు. ఈసందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ పొంగులేటి రాక సందర్భంగా మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించాక సిద్దారం రోడ్డులో క్యాంప్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఆతర్వాత లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో జరిగే సమావేశంలో కాంగ్రెస్‌లో పలువురు చేరనున్నారని పేర్కొన్నారు. మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొనే ఈ కార్యక్రమాలకు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కాగా, అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు రామిశెట్టి సుబ్బారావు, గాదిరెడ్డి సుబ్బారెడ్డిని విజయబాబు, సుధాకర్ పరామర్శించారు. అలాగే, పట్టణానికి చెందిన ఎస్.గోవర్ధన్‌రావు మృతి చెందగా నివాళులర్పించారు. గౌరిగూడెం సర్పంచ్ మందపాటి ముత్తారెడ్డి, నాయకులు మలిరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, ఉడతనేని అప్పారావు, కాలేని రాజేష్, సాయి, మందపాటి రవీందర్‌రెడ్డి, పద్మజ్యోతి, వెంకటనారాయణరెడ్డి, నాగళ్ల ప్రసాద్, కొత్తూరు కోటేశ్వరరావు, కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.



సుబ్బారావును పరామర్శిస్తున్న విజయబాబు, సుధాకర్

ఆర్యవైశ్య కల్యాణ మండపం అధ్యక్షుడిగా కృష్ణమూర్తి



నూతన కమిటీ సభ్యులను సత్కరిస్తున్న పెద్దలు

వైరా: వైరా ఆర్యవైశ్య కల్యాణ మండపం నూతన అధ్యక్షుడిగా ఆర్యవైశ్య వాణిజ్య విభాగం వైరా నియోజకవర్గ నాయకుడు డాక్టర్ పెరుమాళ్ల కృష్ణమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం కల్యాణ మండపంలో ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నంబూరి మధు సూదన్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా వనమా విశ్వేశ్వరరావు, అధ్యక్షుడిగా పెరుమాళ్ల కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావు, కోశాధికారి వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా కృష్ణమూర్తి, నాగి, నాగేశ్వరరావు, కార్యదర్శులుగా చక్రవర్తి, వెంకటేష్, సతీష్, శ్రీదర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సుబ్బారావు, ప్రసాద్, సత్యంబాబు, కృష్ణార్జునరావు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, ప్రభాకర్ రావు, సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

వైరా: వైరాలో గురువారం స్థానికులు ఎస్సై మేడా ప్రసాద్ సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అపరిచిత వ్యక్తులతో ఫోన్‌లో గానీ, నేరుగా కానీ పంచుకోవద్దన్నారు. ఆండ్రాయిడ్ ఫోన్‌లలో వివిధ రకాల యాప్‌లు అప్‌డేట్ చేయమని మెసేజ్‌లు వస్తుంటాయి వాటని గుడ్డిగా నమ్మొద్దన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో వైరా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజీనామా



బీఆర్‌ఎస్‌కు రాజీనామా ప్రకటిస్తున్న కౌన్సిలర్ ఎస్‌కే మౌలాలి, తదితరులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మున్సిపాలిటీ 18వ వార్డు కౌన్సిలర్ ఎస్‌కే మౌలాలి బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. గురువారం సత్తుపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 22న సత్తుపల్లిలోని శ్రీలక్ష్మీ ప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో జరిగే సభలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు మున్వర్ హుస్సేన్, రమణ, మగ్బుల్, షఫీ, నన్నేబాబు, మంగ, లక్ష్మి, సత్యావతి, రాము పాల్గొన్నారు.

కార్మిక గర్జనను జయప్రదం చేయండి

వైరా: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 4న హైదరాబాద్‌లో నిర్వహించే కార్మిక గర్జన సభను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామయ్య పిలుపునిచ్చారు. గురువారం వైరాలోని విక్రమ్ భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకన్న అధ్యక్షతన నిర్వహించిన ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు అశోక్, శ్రీనివాసరావు, లాల్‌మియా, పుల్లారావు, వెంకన్న, పుల్లయ్య పాల్గొన్నారు.

జ్యోతిర్మయి ఫౌండేషన్ వితరణ

కారపల్లి: ఎన్నో రోజులుగా అనారోగ్యానికి గురై ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న మండలంలోని గాదెపాడు గ్రామానికి చెందిన భూక్యా సంతు కుటుంబానికి జ్యోతిర్మయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెలరోజులకు సరిపడా నిత్యావసర సరుకులను గురువారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు జ్యోతిర్మయి మాట్లాడారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మజీద్‌పాషా, ఉపేందర్‌సింగ్, రఘు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

బోనకల్: మండల కేంద్రంలోని సొసైటీ కాంప్లెక్స్ ఆవరణలో గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. లేబర్ కార్డు కలిగి ఉండి 18–60 సంవత్సరాల వయస్సు ఉన్న వారికి బీపీ, షుగర్, థైరాయిడ్, సీబీపీ, కేన్సర్ మొదలగు 50 రకాల పరీక్షలను నిర్వహించారు. ఈ క్యాంప్‌లో 100మందికి పైగా రోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ బోయినపల్లి వీరబాబు, క్యాంప్ నిర్వాహకులు శ్రీనివాసరావు, తెల్లాకుల శ్రీనివాసరావు, శ్రీను, బుజ్జి పాల్గొన్నారు.

రజాకార్లను గుర్తుకు తెస్తున్నారు

ఏన్కూరు: కేసీఆర్ ప్రభుత్వం రజాకార్లను గుర్తుకు తెస్తున్నారని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొవ్వూరి నాగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలించేందుకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని అడ్డుకుని అరెస్ట్ చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, రాందాస్, శశికిరన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

జనసేన గ్రామ కమిటీ ఎన్నిక


ఎర్రుపాలెం: మండలంలోని కొత్తపాలెం గ్రామంలో గురువారం జనసేన మండల కమిటీ అధ్యక్షుడు మిరియాల నాగేశ్వరరావు సమక్షంలో జనసేన పార్టీ గ్రామ కమిటీ ఎన్నిక జరిగింది. పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పగడాల సురేష్, ఉపాధ్యక్షుడిగా గుర్రాల పున్నారావు, ప్రధాన కార్యదర్శి హరి సుబ్బారావు, కార్యదర్శి పోశం వెంకటకృష్ణ, కోశాధికారిగా హరికృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల కమిటీ అధ్యక్షుడు మిర్యాల నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, వేమా ఏడుకొండలు తదితరులు ఉన్నారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో సాయిబాబా ఆలయాల్లో గురువారం బాబాకి శాస్త్రోక్తంగా, సాంప్రదాయబద్ధంగా ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో భక్తులు పాల్గొని బాబాను దర్శించుకున్నారు. మండలకేంద్రంలోని సాయిబాబా ఆలయంలో కర్నాటి మాధవరెడ్డి, నలజాల శ్రీనివాసరావు, కర్నాటి లక్ష్మిలు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కంచర్ల వెంకటస్వామి తదితరులున్నారు.

చెరువులకు నీరు చేరేనా?

వేంసూరు: బేతుపల్లి చెరువు నుంచి వేంసూరు మండలంలోని 56 చెరువులకు సాగు నీరు అందించేందుకు ఏర్పాటు చేసిన బేతుపల్లి ప్రత్యామ్నాయ కాల్వ అధ్వానంగా తయారైంది. కాల్వలో జమ్మి, వివిధ రకాల పిచ్చి మొక్కలు పెరగడంతో అందులో ప్రవహిస్తున్న నీరు సరిగా ముందుకు సాగడం లేదు. గురువారం బేతుపల్లి చెరువు నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు నీరు విడుదల చేసినా.. పిచ్చి మొక్కల కారణంగా తమ చెరువులకు నీరు చేరతాయో.. లేదో? అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైన ఐబీ అధికారులు స్పందించి సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



మర్లపాడు వద్ద అధ్వానంగా ఉన్న బేతుపల్లి ప్రత్యామ్నాయ కాల్వ